# మెఱుపులు : తెలుగు కళా సమితిలో తెలుగు

*- వేమూరి వేంకట రామనాథం*

నన్ను ఈ వ్యాసం వ్రాయమని కోరిన శ్రీ భావరాజుతో జరిగిన సంభాషణను పురస్కరించుకొని ఇది సంక్షిప్తంగా, ప్రధానంగా తెలుగు కళా సమితి వారి "తెలుగు"కు సంబంధించిన కార్యక్రమాలపైన ఒక సింహావలోకనం గాను ముందుకు పనికి వచ్చే సూచన గాను ఏర్పఱువలెనని నిశ్చయించాను.

తొలుదల్త మన రఘునాథ్ వాత్సల్యంతో నడుపుతూ వచ్చిన తెలుగు జ్యోతిని గూర్చి ఒక మాట చెబుతాను. నేను అమెరికాలో వివిధ ప్రదేశాలకు వెళ్ళినపుడు గాని టెలిఫోనులో దూర మిత్రులతో మట్లాడినప్పుడు గాని మన "తెలుగు జ్యోతి" యెద ఎందరు ఎంత ప్రియంగా స్పందిస్తున్నారో గ్రహించి,. ఆనందిస్తూఉంటాను.ఇది నెలా నెలా కాక రెండు నెలల కొకసారిగా ఆర్థిక కారణాల వలన మారినపుడు రఘునాధ్ ఎంత ఖిన్న వదనుడై నాడో నాకింక గురుతే. కాని సమర్థత గల సంపాద కత్వంలో చక్కగా వస్తున్నదన్న తృప్తితో ఈ వ్యాసం వ్రాస్తున్నాను.

౧. తొలి మెఱుపుగా నా "మెఱుపుల"తో ప్రారంభిస్తాను. ఇవి రఘునాథ్‌తో ఒక నాటి సంభాషణలో యాదృచ్ఛికం గా తళుక్కు మన్న ఊహ. "ఏ మండీ, ప్రతి నెలా ఏదైనా వ్రాయరాదండీ" అన్న వారి ప్రశ్నకు తక్షణ స్పందనగా నా "మెఱుపులు" మొదలైనాయి. ఇవి సారసత్వ విషయాల మీదనె కాక, సాంఘిక,రాజకీయ,అంతర్జాతీయ విషయాల మీద కూడా - ఇప్పటికి సుమారు ౧౫౦ శీర్షికల క్రింద వచ్చినాయి. మొదటి రెండు పుస్తకాలు కూడ అచ్చు అయినాయి. వ్యాసరచనలో అభిలాష వున్న వారికి ముఖ్యంగా పిన్న వారికి, వీటిలోని సమర్థత గల సంపాదకత్వంలో చక్కగా వస్తున్న దన్న తృప్తితో ఈ వ్యాసం వ్రాస్తున్నాను. ప్రధానాంశాంలు కొన్ని మనవి చేస్తాను. వ్యాసం సంక్షిప్తంగా వుండాలి - నిజానికి ఇది అతి దీర్ఘ వ్యాసం కన్న కష్టతరం. ఒక విషయంపై ప్రధాన కేంద్రీకరణతో రెండు ప్రక్కల "అభిప్రాయాలను గమనిస్తూ, వర్ణనలో కౌశలం ప్రకటిత మవుతూ వ్రాయాలి. ఎంత చిన్న కథా వస్తువయినా-ఉదా: " రాగి నాణెము", "అయిదునిముషాలు", "క్యూ", "వ్యవధి లేదు" - వ్యాస విధానం, రచనా ధ్యేయం ప్రయోజకంగా ఉండాలి. చేయి తిరిగిన రచయితలకిది చెప్పనక్కర లేదు కాని, తెలుగు కళా సమితికి సాధారణ వ్యాసకర్తలకు హితం చెప్పవలసిన భాద్యత వున్నది కనుక ఉన్నదని నేననుకుంటున్నాను, కనుక ఈ అలతి సందేశం ఇస్తున్నాను.

మఱొక సూచన "తెలుగుజ్యోతి"లో వైదేహి పుణ్యమా అని యేమో కొలదిగా పద్యాలు పాడటం మొదలయిందికాని, రెండు రెండు క్షమార్హమైన సూచనలు: ఒకటి, ఛందోబద్ధమైన మైన కవిత -మనం మామూలుగా పద్యాలు అనుకునేవి - మచ్చుకైనా ఉంటే బాగుంటుంది. రెండు, ఆ పద్య కవిత కూడా కవిత యే కాని దానిలోని కవిత్వతత్త్వం కొంచం "బిరుసు" చేయబడాలి. - అంటే సంస్కృత పదాలతో అని కాదు."

తెలుగు జ్యోతి వ్యాసాలలో శ్రీ భావరాజు వారి సున్నితమైన హాస్యరసం- ఉదా. ఏప్రిల్ ౨౦౦౮ సంచిక లోని "డు యు లవ్ మి"? - ప్రత్యేకంగా ప్రశంసనీయం. అలాగే జనవరి-ఫిబ్రవరి ౨౦౦౯ సంచికలోని శ్రీ కాశీ నాధుని మహేశ్వరప్రసాద్ యొక్క "మాఘ"కవి వైశిష్ట్యం.

౨. తెలుగుకళాసమితి వారి "సారస్వత సమాహం" అన్న కార్యక్రమం చాలా రోజులు(గా) జరిగింది. నేను స్వయంగా ఆక్రమించు కొన్న అధ్యక్షత్వంతో, నా కోరికపై వ్యవహరించిన శ్రీ కలశపూడి శ్రీనివాసరావు కార్య దర్శకత్వంతో హాజరు అంటే సభ్యుల సంఖ్య తక్కువే; అది తప్పదు కాని మొక్కకు వేరు వలె అది ఫలవంతంగా ఉండేది. స్వరచనలు చదువుతూ ఉన్నవారి లో వైదేహి, జననీకృష్ణ, సుప్రభ, భావరాజు, వసుంధర, శ్రీనివాసరావు, బండ్లమూడి లక్ష్మి, శాంతి కుమార్, విస్సావఝ్ఝల, చోడవరపు ప్రసాద్, మస్తాన్ రెడ్డి, వేణు గోపాల్, కిడాంబి రఘునాథ్, కొల్లి ఇందిర, అప్పాజోస్యుల మొదలైన వారు ఉన్నారు. సుప్రభ పద్యబాహుళ్యం, విస్సావఝ్ఝల అనర్గళ ఉపన్యాసం (అలంకారలమీద ) నాకింకా గుఱుతే.

ఈ సభలు సాధారణంగా ఎవరి ఇంటిలోనో జరిగేవి, సభికులకు రుచికరమైన భోజనం దొరికేది కూడ. ఈ సభానిర్వహణలో ఒక చిన్ని విషయ మేమంటే మధ్యలో ఒక అరగంట విశ్రాంతి - ఉపాహారం సంగతి అటుంచి, ఆ సమయంలో రచయితలు తమ రచనలను గూర్చి నాతోను, ఒకరితో నొకరు, సంప్రదించుకొనేవారు.

ఇది "సమూహం": యొక్క నిక్కమైన ప్రయోజనాలలో ఒకటి. అవకాశం ఉంది. ఉపయోగం మనవంతు !

ఈ సమూహం కార్యక్రమం కుంటు పడి ఇప్పటికే సుమారు నాలుగైదేండ్లయింది. తెలుగుకళాసమితి వారికి నా హృదయ పూర్వక నివేదన యేమంటే, దీనికి పునర్జీవనం కలిగించండి. ప్రయోజనం అదృశ్యంగా వృద్ధి చెందుతుంది. ఇండియాలో వలె విరివిగా సారసత్వ ప్రతిస్పందనకు అవకాశంలేని యీ ఖండంలో మన రచయితలకు కొంతగానైన పరస్పర చర్చలకు అవకాశం కలుగుతుంది. ఎందుకు వస్తారు, అన్నది కాదు ప్రశ్న; వచ్చిన వారికి నాకింక ఎంత మేలు కలుగుతుందో అన్న ఆశ ప్రధానం. తెలుగు కళా సమితి వారు చేయదగిన కార్యక్రమాలలో ఇదొకటి అని కార్యకర్తలు విశ్వసించ వలెనని నా కోరిక.

ఈ సంధర్భంలో ఇటీవలి (ఏప్రిల్ ౨౦౦౮ ) సంచికను పురస్కరించుకుని ఒక మాట నివేదిస్తాను. అంత చక్కగా, కోణనిర్దేశంతో నిండిన సంచిక రెండు ఏండ్ల కొక మారైనా ప్రచురిస్తే బాగుంటుంది. న్యూజెర్సీ తెలుగు వారి స్వతంత్రరచనా కౌశలం అమెరికాలో నలు దిక్కులలోనే కాక ఇండియాకు కూడ విస్తరిస్తుంది.

ఒక చిన్న మాట. తెలుగు జ్యోతి సంచికలు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్ళేట్లు గట్టి ప్రయత్నం చేయాలి. ఇక్కడి రచయితలను గూర్చి, వీరిని అదలించే సమస్యలను గుఱించి, అక్కడ మన మిత్రులుకు విదితం అవుతుంది. వారి నుండి యీ పత్రికకు మధ్యమధ్య వ్యాసాలు వచ్చే అవకాశం కూడ ఉంటుంది. ఇక్కడి రచయితలను గుఱించి ఏ కొద్దిగా నైనా అక్కడి వారికి తెలుస్తుంది. (పోస్టు ఖర్చులు తప్పవు.)

౩. మఱొక విషయానికి వస్తాను. ఇక్కడ తెలుగులో మాట్లాడే వారు ముఖ్యంగా, వయసులో పెద్ద వారు, క్రొత్తగా ఇండియా నుండి వచ్చిన వారు. తరువాతి తరాలకు తెలుగులో ఏ స్వల్పంగా నైనా పరిచయం కలిగించ గలిగితే - దీర్ఘకాల దృష్ట్యా - మంచిది అనుకుంటాను. ఈ విజ్ఞా నరంగంలో అక్కడక్కడ కొన్ని ప్రయత్నాలు జరుగుతున్నయి. తెలుగు సమితి - సంస్థా ముఖంగా- ఈ విషయంలో ఏ స్వల్పంగా నైనా ఫలవంత మైన కార్యక్రమం ఏర్పరచి చిన్న పిల్లలకు తెలుగులో విరివిగా మాట్లాడే కౌశలము, ధైర్యము కలిగించగ గలిగితే మంచిది. ఇలాంటి ప్రయత్నాల ఫలితాలు ధీర్ఘ కాలంలోగాని విదితం కావు. అందువలననే ఈ సంస్థ వంటి ప్రజా కూటమి వలసిన ఉత్సాహం చూపాలి అని, దాని ఫలం మెల్ల మెల్లగా విదితం అవుతుందని నా ఉద్దేశం. ఆదాయవ్యయ దృక్పధానికి మించిన ఆశయ స్పగతతో ఇలాంటి కార్య కలాపాలు రూపొందాలి.

ఈ మధ్య కొంతకాలంగా నడిపిన తెలుగు విద్యా బోధనప్రయత్నాలను ఈ సందరంలో తెలియ పరుస్తాను. స్థలాభావం మొదలగు కారణాల వలన వాటిలో కొన్ని ఇటీవల ఆగిపోయినవని తెలిసికొన్నాను. నిజానికి మన సమితి వంటి సంస్థ పూనకొన వలసిన ఉత్తమ కార్యక్రమమిది.

4. తెలుగు కళా సమితి వంటి సంఘము యొక్క కృషి వలననే సాధ్యమయ్యే మఱొక వాంఛనీయ కార్యక్రమం ఉంది. తెలుగు నేలకు చెందిన ఎందరో ప్రఖ్యాత పురుషులను, స్త్రీలను గుఱించి ఇక్కడి తెలుగు వారికి ముఖ్యంగా పిన్నలకు - కొంత కనీస సమాచార మైనా లభించేందుకు అనువైన వసతి కలుగ జేయాలి. నా ఉద్దేశ్యంలో, మనకు తెలుగుజ్యోతి వాహికగా ఉండ గలదు గదా, అందులో ప్రతి సంచిక లోను ఒకరిపై (లేక ఇరువురు పైన) సంక్షిప్త వ్యాసం అర్ధమయ్యేటట్లు చూడాలి. ఇది చెప్పినంత తేలిక కాదు, ఆచరణలో. ఎందుకనగా ఏ రాధా కృష్ణన్, గిరి, సంజీవ రెడ్డి వంటి వారి గురించియో మించి మిగతా ఎందరో మహాను భావుల చరిత్రలు చాలా మంది (పెద్దలకే) నిశ్చయంగా సవ్యంగా సమగ్రంగా తెలియవు. వారు చరిత్ర పుటల మధ్య ఇఱుక్కు పోవటం కాక, మనకు మన పిల్లలకు ఉత్తేజకర వ్యక్తులుగా ప్రజ్వలించ వలెనంటే, వారిని, వారి కార్యకలాపాలను, వారి విజయాలను తెలియపరచే నిష్పాక్షిక వ్యాసాలు కావాలి. (ఇటీవలి ఒక సంచికలో శ్రీ ప్రకాశం పంతులు మీద చక్కని వ్యాసం వచ్చింది.) . మనం వర్ణించవలసిన మహామహులు సారస్వత రంగానికి, కళలరంగాలకు, రాజకీయాలకు, ఆర్ధిక వ్యాసంగానికి, ప్రభుత్వ కార్యాలకు (డాక్టర్ సి.ఆర్.రెడ్డి వలె ) విద్యా రంగానికి, మహిళోద్యమాలకు, సాంఘిక చైతన్య కార్యక్రమాలకు, చెంది - ఇలా ఎన్నో రీతుల ప్రజ్ఞ గడించిన వారున్నారు. ఇది సమితి కర్తవ్యం, తెలుగుజ్యోతి అనుకూలమైన సాధనము.

ముగింపులో ఒక మనవి. నా వ్యాసం ఇతర రచయితల వ్యాసాల విషయాలలోనికి పోనట్లు సాధ్య మయినంత జాగ్రత్త తీసుకున్నాను. నన్ను వ్రాయమని శ్రీభావరాజు కోరిన పరిధిలోనే ఇముడ్చ ప్రయత్నించాను.